
సాక్షి పల్నాడు

ఆదివారం । 14 । మే । 2023



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 521.70 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి ఎస్‌ఎల్‌బీసీకి విడుదలవుతున్న నీటిని నిలిపివేశారు.



నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో శనివారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.1,500, గరిష్ట ధర రూ.3,000, మోడల్ ధర రూ.2,000 వరకు పలికింది.



ప్రతిధ్వనించిన వేదనాదం

విజయవాడ కల్చరల్: విజయవాడ ఇందిరా గాంధీ స్టేడియంలో నిర్వహిస్తున్న అష్టోత్తర శత (108) కుండాత్మక చండీ, రుద్ర, రాజ శ్యామల సుదర్శన సహిత శ్రీ లక్ష్మీ యజ్ఞం శనివారం వైభవంగా కొనసాగింది.

వైభోగం..గృహయోగం

పేదల పండుగకు పరుగులు

పట్టాలు సిద్ధం

- 38 వేలకుపైగా పట్టాలపై సంతకాలు చేసిన మంగళగిరి తహసీల్దార్
- లేఅవుట్లలో ఆగమేఘాలపై పనులు
- సిబ్బందికి అక్కడే షామియానాలు, భోజన సౌకర్యాలు
- వడదెబ్బ తగలకుండా వైద్య శిబిరాలు
- నిత్యం పర్యవేక్షిస్తున్న జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, జాయింట్ కలెక్టర్ రాజకుమారి
- ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్సీలు తలశిల, లేళ్ల



37 వేలకుపైగా జగనన్న పట్టాలపై సంతకాలు చేస్తున్న మంగళగిరి తహసీల్దార్ రామ్‌ప్రసాద్



గుంటూరు జిల్లా నిడమర్రులో సిద్ధమవుతున్న లేఅవుట్



కృష్ణాయపాలెంలో లేఅవుట్ హద్దులకు రాళ్ల కొలతలు చూస్తున్న డీఆర్‌డీఏ పీడీ హరిహరనాథ్



నిడమర్రు జగనన్న లేఅవుట్‌లో కొలతలు వేస్తున్న సర్వే అధికారులు

సాక్షి ప్రతినిధి, గుంటూరు : పేదల పండుగకు సర్వం సిద్ధమవుతోంది. పేదలకు ఇచ్చే పట్టాలు సిద్ధమయ్యాయి. మంగళగిరి తహసీల్దార్ రామ్‌ప్రసాద్ ఒక్కరే 37,848 మందికి పట్టాలు ఇచ్చేందుకు వాటిపై సంతకాలు చేశారు. ఒరిజినల్ కాపీ, కార్యాలయ కాపీలపై కలిసి 75 వేలకు పైగా ఈ వారం రోజుల్లో సంతకాలు పెట్టి వాటిని ఆగమేఘాలపై సిద్ధం చేశారు. ఒక్కోరోజు రోజుకు 12 నుంచి 14 గంటల పాటు సంతకాలు చేయడానికే సమయం కేటాయించారు. భవిష్యత్‌లో గాని ఇంతకు ముందు గాని ఒకే అధికారికి ఇన్ని వేల మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చే అవకాశం దక్కలేదని, ఇది తన పూర్వజన్మ సుకృతమని మంగళగిరి తహసీల్దార్ 'సాక్షి' వద్ద తన ఆనందం వ్యక్తం చేశారు.

తాడేపల్లి అర్బన్‌లో 6,542 మందికి, తాడేపల్లి రూరల్‌లో 2005 మందికి, పెదకాకాని లబ్ధిదారులు 1,869 మందికి, మంగళగిరి అర్బన్‌లో 4,602 మందికి, మంగళగిరి రూరల్‌లో 3,418 మందికి, తుళ్లూరు వారికి 1,343, విజయవాడ పశ్చిమలో 6,121 మందికి, విజయవాడ సెంట్రల్‌లో 8,343 మందికి, విజయవాడ తూర్పులో 3,605 మందికి పట్టాలు మంగళగిరి తహసీల్దార్ కార్యాలయంలో సిద్ధం చేశారు.

శరవేగంగా లేఅవుట్లలో పనులు..

మరో వైపు లేఅవుట్లలో పనులు శరవేగంగా జరుగుతున్నాయి. హైకోర్టు తీర్పు వచ్చిన తర్వాత పనులు వేగం పుంజుకున్నాయి. ప్రతి లేఅవుట్‌లోనే జంగిల్ క్లియరెన్స్‌తో పాటు నేలను చదును చేయడం. సర్వే రాళ్లు పాతే ప్రక్రియ జరుగుతోంది.ఎండలు 44 డిగ్రీలకు చేరుకోవడంతో ప్రతి లేఅవుట్‌లో సిబ్బంది ఉండటానికి షామియానాలు వేయడంతో పాటు వారికి అక్కడే భోజన ఏర్పాట్లు చేశారు. ప్రతి లేఅవుట్ వద్ద వడదెబ్బ తగలకుండా ఉండేందుకు వైద్య శిబిరాలను కూడా నిర్వహిస్తున్నారు. ప్రతి లేఅవుట్ వద్ద డిప్యూటీ కలెక్టర్ స్థాయి అధికారి పర్యవేక్షిస్తుండగా, అతి పెద్ద లే అవుట్‌గా ఉన్న నిడమర్రు వద్ద అసిస్టెంట్ కలెక్టర్ శివన్నారాయణ శర్మ స్వయంగా ఉండి పనులు పర్యవేక్షిస్తున్నారు.

పనుల పురోగతిపై సమీక్ష ...

ప్రతిరోజూ జిల్లా కలెక్టర్ ఎం వేణుగోపాలరెడ్డి, జాయింట్ కలెక్టర్ రాజకుమారి ప్రతి లేఅవుట్‌ను సందర్శించి పనుల పురోగతిని సమీక్షిస్తున్నారు. సమస్యలు ఉంటే అక్కడికక్కడే నిర్ణయం తీసుకుంటున్నారు. మరో వారంలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా పట్టాల పంపిణీ ఉండటంతో అక్కడ జరుగుతున్న పనుల తీరును, ముఖ్యమంత్రి సభ ఎక్కడ ఏర్పాటు చేయాలనే అంశంపై జిల్లా కలెక్టర్ ఎం. వేణుగోపాల్ రెడ్డితో పాటు ఎమ్మెల్సీలు తలశిల రఘురామ్, లేళ్ల అప్పిరెడ్డి శనివారం పరిశీలించారు.

మా సొంత ఇంటి కల నెరవేరనుంది



జగనన్న ప్రభుత్వం వచ్చిన దగ్గర నుంచి మాకు ఇళ్ల పట్టాలు వస్తాయని ఎదురు చూశాం. మా ప్రాంతం వారికి కేటాయించిన స్థలంపై కొంతమంది కోర్టును ఆశ్రయించడంతో మాకు పట్టాలు ఇవ్వలేదని అధికారులు చెబుతున్నారు. శుక్రవారం కోర్టు అనుకూలంగా తీర్పు ఇచ్చింది. అందరికీ ఇళ్ల స్థలాలు ఇస్తారని సచివాలయం సిబ్బంది తెలియజేశారు. మాకు కూడా సొంత ఇంటి కల నెరవేరుతుంది.

– ఎస్‌కే కరీమున్నీసా, డ్రైవర్ కాలనీ

రాజకీయ చిక్కు ముడులు వీడాయి



పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించే విషయంలో కొంతమంది రాజకీయ నాయకులు కోర్టును ఆశ్రయించి మాకు ఇళ్ల పట్టాలు రాకుండా అడ్డుకున్నారు. ఎట్టకేలకు న్యాయ స్థానంలో రాజకీయ చిక్కుముడులకు స్వస్తి పలికి పేదలకు ఇళ్ల స్థలాలను కేటాయించండంటూ తీర్పు వెలువడింది. ఈ ప్రాంతంలో ఎక్కువ మంది పేదవాళ్లు అద్దె ఇళ్లల్లోనే నివాసముంటున్నారు. ఇప్పుడు ప్రతి ఒక్కరికీ ఇళ్ల స్థలం రావడం చాలా ఆనందంగా ఉంది.

– నారాయణరెడ్డి, పోలకంపాడు

కోర్టు తీర్పుతో న్యాయం జరిగింది



రాష్ట్ర వ్యాప్తంగా జగనన్న అందరికీ ఇళ్ల స్థలాలను కేటాయించారు. మంగళగిరి తాడేపల్లి ప్రాంతంలో ఇళ్ల పట్టాలు ఇవ్వలేదు. ఇప్పటి వరకు ప్రతిపక్షాల వారు ఇళ్లపట్టాలు ఇవ్వరంటూ ప్రచారం చేశారు. హైకోర్టులో పేదలకు అనుకూలంగా తీర్పు రావడంతో మాకు కూడా ఇళ్ల స్థలాలు కేటాయిస్తున్నారంటూ వలంటీర్లు చెప్పారు. పేదలకు కోర్టులో న్యాయం జరిగినందుకు చాలా సంతోషంగా ఉంది.

– ఎస్‌కే నగీనా, నులకపేట

న్యూస్‌రీల్

నేడు దేశీయ ఆవుల అభివృద్ధి కేంద్రం ప్రారంభం



అమరావతి: మండల పరిధిలోని అత్తలూరు–పాలెం సేంద్రియ వ్యవసాయ రైతు సమాఖ్య వారిచే నిర్మించబడిన దేశీయ ఆవుల అభివృద్ధి కేంద్రంను ఆదివారం ప్రారంభిస్తున్నట్లు అత్తలూరు–పాలెం సేంద్రియ వ్యవసాయ రైతు సమాఖ్య చైర్మన్ నూతలపాటి సురేంద్రబాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో నాబార్డు మాజీ చైర్మన్ డాక్టర్ చింతల గోవిందరాజులు, తెలంగాణ నాబార్డు చీఫ్ జనరల్ మేనేజర్ సుశీల, ఇతర అధికారులు పాల్గొంటారని తెలిపారు.

రేడియల్ గేట్ ఆమ్స్ బిగింపు



అచ్చంపేట: వరదలకు కొట్టుకుపోయిన పులిచింతల 16వ నెంబరు గేటు పునర్నిర్మాణంలో భాగంగా రేడియల్ గేట్‌ను అమర్చేందుకు హెవీలోడెడ్ క్రేన్స్ సహాయంతో కాంక్రీట్స్‌పై రెండువైపులా ఆమ్స్‌ని కూర్చోబెట్టే పనిని ఇంజినీర్లు విజయవంతంగా శనివారం పూర్తి చేశారు. ఇంకా 300 టన్నుల బరువు కలిగిన రేడియల్ గేటును ఆమ్స్‌పై ఎక్కించి, ప్రాజెక్టుకు బిగించాల్సి ఉంది. రేడియల్ గేటు బిగించగానే గతంలో 16నెంబరు కానాను మూసేసేందుకు వినియోగించిన స్టాప్‌లాగ్ ఎలిమెంట్స్‌ను తీసేస్తారు. అప్పుడే గేటును పైకెత్తేందుకు, కిందకు దించేందుకు అవకాశం ఉంటుందని ఇంజినీర్లు చెబుతున్నారు.

నేడు కేఎల్‌యూకు హైకోర్టు సీజే రాక

తాడేపల్లిరూరల్: గుంటూరు జిల్లా తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ విశ్వవిద్యాలయంలో నిర్వహించే కార్యక్రమానికి ఆదివారం ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్ కుమార్‌మిశ్రా ముఖ్య అతిథిగా హాజరు కానున్నారని వర్సిటీ న్యాయ కళాశాల విభాగాధిపతి విజయసుధ శనివారం తెలియజేశారు. ఆమె మాట్లాడుతూ బార్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ సహకారంతో ఈనెల 14 నుంచి 16వరకు మూడు రోజుల ఓరియంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, 14వ తేదీ ఆదివారం నాటి కార్యక్రమాన్ని ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా ప్రారంభిస్తారని వివరించారు.

ఆర్‌బీకేలకు వైఎస్సార్ రైతు భరోసా జాబితాలు

కొరిటిపాడు(గుంటూరు): వరుసగా ఐదో ఏడాదికి వైఎస్సార్ రైతు భరోసా పథకం కింద పెట్టుబడి సాయం విడుదలకు సంబంధించి రైతు భరోసా కేంద్రాల వారీగా అర్హుల జాబితా సోషల్ ఆడిట్‌కు వ్యవసాయ శాఖ చర్యలు చేపట్టింది. ఇప్పటికే అర్హులు, అనర్హుల జాబితాలు ఆర్‌బీకేలకు చేరాయి. వీటిని ఆర్‌బీకే ఇన్‌చార్జ్‌లు డౌన్‌లోడ్ చేసి రైతుల పరిశీలనకు పెట్టి అభ్యంతరాలు తీసుకోవడం, వాటిని పరిశీలించి అప్‌లోడ్ చేసేందుకు ప్రభుత్వం షెడ్యూలు విడుదల చేసింది. ఈ నెల 12వ తేదీ నుంచి జాబితాలను ఆర్‌బీకేల్లో ప్రదర్శిస్తున్నారు. 15 నుంచి 18వ తేదీ వరకు కొత్త రైతుల రిజిస్ట్రేషన్ వివరాలు, అభ్యంతరాలను వీఏఏలు వైఎస్సార్ రైతుభరోసా పోర్టల్‌లోకి అప్‌లోడ్ చేస్తారు. ఈ నెల 15 నుంచి 20వ తేదీ వరకు వీటిని మండల ఏఓలు పోర్టల్‌లో ఆమోదించడం లేదా తిరస్కరించడం జరుగుతుంది. ఈ నెల 25 నుంచి 31వ తేదీ లోపు ఏ రోజైన వైఎస్సార్ రైతుభరోసాతో పాటు, 2022 ఖరీఫ్ పంటల బీమా పరిహారం, అకాల వర్షాల వల్ల దెబ్బతిన్న పంటలకు ఇన్‌పుట్ సబ్సిడీ విడుదలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లాంఛనంగా ప్రారంభిస్తారు.

గ్రామస్థాయిలోనే పంటల కొనుగోలు

రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు



మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి అంబటి రాంబాబు

చాగంటివారిపాలెం(ముప్పాళ్ళ): రైతులు పండించిన పంట దిగుబడులను గ్రామస్థాయిలోనే రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాలు ఏర్పాటు చేసి కొనుగోలు చేస్తుందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు పేర్కొన్నారు. మండలంలోని చాగంటి వారిపాలెం గ్రామంలోని గ్రామ సచివాలయంలో జీడీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని శనివారం ప్రారంభించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన విప్లవాత్మక పరిపాలన సంస్కరణలతో ఆర్‌బీకేల ద్వారా గ్రామస్థాయిలోనే పంట ఉత్పత్తులను విక్రయించుకునే అవకాశం ఉందన్నారు. పంటల వివరాలు ఈక్రాప్‌లో నమోదు చేసుకున్న ప్రతి రైతు కొనుగోలు కేంద్రంలో విక్రయించుకునే అవకాశం ఉందన్నారు. దళారులను నమ్మి మోసపోవద్దని, ప్రభుత్వం అందించే ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ముందుగా తూకం యంత్రాన్ని లాంఛనంగా ప్రారంభించారు. రైతులతో మాట్లాడి పంట దిగుబడులు గురించి తెలుసుకున్నారు. తహసీల్దార్ ఎం.భవానీశంకర్, ఏఓ ఎం.అరుణ, జీడీసీఎంఎస్ ఇన్‌చార్జ్ పిచ్చయ్య, అన్నపరెడ్డి సాయిరెడ్డి, అచ్యుత శివప్రసాద్, ఎంజేఎం రామలింగారెడ్డి పాల్గొన్నారు.

విజయ పరంపర కొనసాగాలి

- 'పది'లో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు సన్మానం
- ప్రశంసాపత్రాలు అందజేసిన జిల్లా కలెక్టర్, జేసీ



విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న జిల్లా కలెక్టర్ శివశంకర్, జేసీ శ్యామ్‌ప్రసాద్

నరసరావుపేట: ఒక విజయం మరో విజయానికి సోపానంలా మార్చుకోవాలని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ పదోతరగతి విద్యార్థులకు సూచించారు. ఇటీవల విడుదల చేసిన పదోతరగతి ఫలితాల్లో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివి 500మార్కులకు పైగా సాధించిన విద్యార్థుల్లో టాప్ 20 విద్యార్థులకు జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఆవరణలో శనివారం నిర్వహించిన అభినందన సభకు కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ ఒక మనిషి సుదీర్ఘజీవితంలో ఇది ఒక తొలి విజయమని, ఈ గ్రాఫ్ భవిష్యత్‌లో పెరుగుతూ ఉండేలాకాని తగ్గకూడదన్నారు. స్కూల్ ఫస్ట్ లేదా 90శాతం మార్కులు రాగానే, వచ్చే పొగడ్తలకు పొంగిపోకుండా భవిష్యత్‌లో ఇంకా మంచి విజయాలు సాధించాలనుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల్లో 1600మందికి పైగా 500మార్కులు పైగా రావటంతో జిల్లా ప్రతిష్ట పెరిగిందన్నారు. దీనికి కారకులైన తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు అభినందనలు తెలిపారు. ఇప్పటివరకు తెలుగుమీడియంలో చదివిన వారందరూ ఇంటర్‌లో ఆంగ్లమీడియం తీసుకోవాలని సూచించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాదు మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి క్రమశిక్షణ, పోటీతత్వం, కష్టపడే మనస్తత్వం, పుస్తకాలమీద ప్రేమ, చదువుకోవాలనే జిజ్ఞాస అవసరమన్నారు. ఈసందర్భంగా టాపర్లుగా నిల్చిన విద్యార్థులను దుశ్శాలువాతో సన్మానించి ప్రశంసా పత్రాలు అందజేశారు. నిపుణులైన విద్యావేత్తలచే ఇంటర్మీడియేట్‌లో ఏవిధంగా చదవాలి, ఏ సబ్జెక్టు తీసుకోవాలనే దానిపై వివరించారు.డీఆర్‌ఓ కె.వినాయకం, డీఈఓ కె.శామ్యూల్, తెలంగాణ రాష్ట్రంలో జూనియర్ సివిల్ న్యాయమూర్తిగా ఎంపికైన శ్రీనివాస్, డీడీఓ మహాలక్ష్మి, డీపీఆర్ డీడీ దీప్తి పాల్గొన్నారు.

మంటచింతల

నిప్పుల కొలిమిగా రెంటచింతల

అత్యధికంగా 48.2 డిగ్రీలు నమోదు



సాయంత్రం 4గంటల సమయంలోనూ నిర్మానుష్యంగా మాచర్ల-గుంటూరు ప్రధాన రహదారి



రెంటచింతల: వేసవిలో మంటచింతలగా రాష్ట్రవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన రెంటచింతల నిప్పుల కొలిమిలా భగభగమండుతుంది. బుధ, గురు, శుక్ర వారాలలో వరుసగా మూడు రోజులుగా 42.4, 43.6, 44.3 గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గ్రామంలో శనివారం గరిష్ట ఉష్ణోగ్రత 48.2 డిగ్రీలు, కనిష్ట ఉష్ణోగ్రత 28.8 డిగ్రీలుగా నమోదు కావడంతో ఒక్కసారిగా రెంటచింతల అగ్నిగుండంగా మారింది. ఈ ఎడాది ఇప్పటివరకు ఈ ప్రాంతంలో నమోదైన అత్యధిక ఉష్ణోగ్రత ఇది. రెంటచింతల చుట్టు పక్కల గ్రామాల్లో ఎక్కువగా నల్ల నాపరాయి నిక్షేపాలు ఉండటం కారణంగా ఇక్కడ ప్రతి ఏటా వేసవిలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఎండ తీవ్రతతో పాటు భూమి నుంచి భగభగ మంటూ వేడి సెగలు రావడంతో గ్రామస్తులు అల్లాడిపోయారు. పలు పనులకు వెళ్లిన కూలీలు ఎండకు తట్టుకోలేక ఉదయం 11 గంటలకే ఇంటి ముఖం పడుతున్నారు. దీనికితోడు రాత్రి 7 వరకు వీస్తున్న వడగాడ్పులు వలన ప్రజలు, ముఖ్యంగా వృద్ధులు, బాలింతలు, గర్భిణులు, చిన్నారులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రస్తుతం రెంటచింతలలో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతుండటంతో గ్రామస్తులు ఉదయం 9 గం.లు దాటితే ఇళ్లు విడిచి ఆరుబయటకు రావడానికి హడలిపోతున్నారు. దీంతో గ్రామంలోని వీధులన్నీ జన సంచారంలేక నిర్మానుష్యంగా మారాయి. ఎండలు తీవ్రంగా ఉండటంతో బయటకు వస్తే ఎక్కడ వడదెబ్బకు గురికావాల్సి వస్తుందోనని ఆందోళన చెందుతున్నారు.

అదాలత్‌లతో సత్వర పరిష్కారం

పదో అదనపు జిల్లా జడ్జి జి.వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న జడ్జి జి.వెంకటేశ్వర్లు

గురజాల: లోక్ అదాలత్ ద్వారా సత్వర పరిష్కారం లభిస్తుందని పదో అదనపు జిల్లా జడ్జి జి.వెంకటేశ్వర్లు సూచించారు. స్థానిక కోర్టు సముదాయంలో శనివారం మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా పదో అదనపు జిల్లా జడ్జి, మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాజీకి అనుకూలంగా ఉన్న కేసులను అదాలత్ ద్వారా పరిష్కారం చేసుకోవచ్చన్నారు. సివిల్ కేసులు 13, క్రిమినల్ కేసులు 142, మనోవర్తి కేసులు 5, ప్రి లిటిగేషన్ కేసులు 5 మొత్తం 165 కేసులు పరిష్కరించామన్నారు. వాటికి సంబంధించి కక్షిదారులకు రూ.1,05,81,231లు నగదు అందించడం జరిగిందన్నారు. సీనియర్ సివిల్ జడ్జి బీఎల్‌వీ శేషాద్రి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి డి.షర్మిలా, అదాలత్ సిబ్బంది పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

నరసరావుపేట టౌన్: జాతీయ లోక్‌అదాలత్ జిల్లాలోని కోర్టుల్లో శనివారం నిర్వహించారు. లోక్ అదాలత్‌లను సద్వినియోగం చేసుకోవాలని న్యాయమూర్తులు సూచించారు. జిల్లా కోర్టులో 264 కేసులు పరిష్కారం కాగా కక్షిదారులకు రూ.3,17,63,500 పరిహారం కింద లభించిందని 13వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఒ.వెంకట నాగేశ్వరరావు శనివారం తెలిపారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అదనపు జిల్లా కోర్టు ప్రాంగణంలో లోక్ అదాలత్ నిర్వహించారు. అదాలత్‌లో క్రిమినల్ కేసులు 70, చెక్ బౌన్స్ 11, మోటర్ వాహన ప్రమాదాలు 18, సివిల్ అప్పీల్ 2, ఓఎస్‌టీ 6, ఐడీఓపీ 1, ఓఎస్ఎం 3, ఈపీ 9, ముందస్తు వ్యాజ్యాలు 6, సీఆర్ఎల్ఎంపీ కేసులు 138 పరిష్కారమైన వాటిలో ఉన్నాయి. న్యాయమూర్తి ఆర్.ఆశీర్వాదంపాల్, ఏపీపీ కాకుమాను బాలహను మంతారెడ్డి, లోక్ అదాలత్ సభ్యులు ఎం.సుబ్బారావు, ఏవీవీ బ్రహ్మానందం పాల్గొన్నారు.

366 కేసులు పరిష్కారం

సత్తెనపల్లి: పట్టణంలోని మూడు బెంచీల్లో జాతీయ లోక్ అదాలత్‌ను శనివారం నిర్వహించారు. సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో సీనియర్ సివిల్ జడ్జి డి.నాగ వెంకటలక్ష్మి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో జడ్జి కె.ప్రశాంతి, మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో జడ్జి ఎ.తౌషిద్ హుస్సేన్ లు లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ అదాలత్‌కు బి.లక్ష్మీకోటేశ్వరరావు, గంటా వెంకట శివ, కంబాల అనిల్ కుమార్‌లు మెంబర్లుగా వ్యవహరించారు. మొత్తం 366 కేసులను పరిష్కరించారు. వీటి ద్వారా రూ. 85,05,743 చేతులు మారాయి.



మాచర్లలో లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్న జూనియర్ సివిల్ కోర్టు జడ్జి శారదాదేవి

మాచర్లలో..

మాచర్ల: కక్షిదారులు జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకొని రాజీ పడదగ్గ కేసులను పరిష్కరించుకోవాలని మండల న్యాయ సేవా కమిటీ చైర్మన్, జూనియర్ సివిల్ కోర్టు జడ్జి శారదాదేవి అన్నారు. స్థానిక కోర్టులో లోక్ అదాలత్ శనివారం నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా మహాలోక్ అదాలత్, జాతీయ లోక్ అదాలత్ ద్వారా వేలాది కేసులు పరిష్కరించటం జరుగుతుందన్నారు. కక్షిదారులు కోర్టుల చుట్టూ తిరిగి సమయాన్ని వృథా చేసుకోకుండా కేసులు రాజీకి అవకాశం ఉందని చెప్పారు. 11 సివిల్ దావాలు, ఐదు ఈసీలు, 61 క్రిమినల్ కేసులు, 8 చెక్ బౌన్స్ కేసులు, 4 భరణం కేసులు, మరో 167 కేసులను పరిష్కరించారు. మొత్తం 268 కేసులు లోక్ అదాలత్‌లో పరిష్కరించటం జరిగింది. కార్యక్రమంలో ఏపీపీ పీ రవీంద్ర, బార్ అసోసియేషన్‌కు చెందిన శీలం వెంకటేశ్వర్లు, జూపల్లి శ్రీనివాసరావు, రామానాయక్, నర్సారెడ్డి, ఏజీపీ జీవీ పాల్గొన్నారు.

సందేశాత్మక నాటికలకు ప్రజాదరణ



సీతారామ అవధానిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి, ప్రిజన్స్ డీఐజీ డాక్టర్ వరప్రసాద్

నరసరావుపేట ఈస్ట్: వాస్తవాల్ని ప్రతిబింబించే సందేశాత్మక నాటక ప్రదర్శనలకు ప్రజాదరణ ఎప్పటికీ ఉంటుందని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. నరసరావుపేట రంగస్థలి ఆధ్వర్యంలో ప్రకాష్‌నగర్ టౌన్ హాలులోని శ్రీ గుర్రం జాషువా కళా ప్రాంగణంలో నిర్వహిస్తున్న 23వ ఆహ్వాన నాటిక పోటీల్లో భాగంగా రెండవ రోజు శనివారం రాత్రి మూడు నాటికల్ని ప్రదర్శించారు. తిలకించేందుకు హాజరైన ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ నాటక రంగాన్ని సజీవంగా ఉంచేందుకు నరసరావుపేట రంగస్థలి తన వంతు కృషి చేస్తోందని కార్యవర్గాన్ని అభినందించారు. సినిమా రంగానికి ఎందరినో పరిచయం చేసిన ఘనత నరసరావుపేట రంగస్థలికే దక్కుతుందని తెలిపారు. నాటక రంగానికి ఆదరణ పెంచాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రిజన్స్ డీఐజీ డాక్టర్ ఎం.వరప్రసాద్ మాట్లాడుతూ నాటక రంగాన్ని సజీవంగా ఉంచుతున్న పరిషత్‌ల కృషిని అభినందించారు. ఈ సందర్భంగా సుప్రీం కోర్టు మాజీ రిజిస్ట్రార్ వి.సీతారామ అవధానిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమాల్ని రంగస్థల అధ్యక్ష, కార్యదర్శులు షేక్ బాజీ, నల్లపాటి బోస్, ఉపాధ్యక్షుడు సింహాద్రి వేణు, కార్యనిర్వాహక కార్యదర్శి కె.ఆర్.ప్రసన్నకుమార్ పర్యవేక్షించారు.

ఉద్యాన పంటలపై రైతులు ఆసక్తి చూపాలి

శావల్యాపురం: రైతులు ఉద్యాన పంటల సాగుకు రైతులు ఆసక్తి చూపాలని జిల్లా ఉపాధి పథకం ప్రాజెక్టు డైరెక్టరు గంగవరపు జోసఫ్‌కుమార్ అన్నారు. ఉపాధి పథకం సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం శనివారం నిర్వహించారు. జోసఫ్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో ఈ ఆర్థిక సంవత్సరంలో నీటి వసతి ఆధారంగా ఉద్యాన శాఖ కింద 1000 ఎకరాల రైతులు సాగు లక్ష్యంగా ఎంచుకున్నట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ ఎకరానికి సాగు ఆధారంగా ఏడాది రూ.30 నుంచి 35 వేల వరకు మూడేళ్ల పాటు రాయితీ విడతల వారిగా సన్నచిన్నకారు రైతులకు మంజూరు చేస్తుందని చెప్పారు. పంటలకు అవసరమైన మొక్కలను కూడా సరఫరా చేస్తామన్నారు. నిధుల కొరత లేదన్నారు. శావల్యాపురం మండలంలో 10 ఎకరాలు ఉద్యయన పంటలు సాగు చేయగా నేటి వరకు బిల్లులు పెండింగ్ లేదని పేర్కొన్నారు. జిల్లాలో ఈ ఆర్థిక సంవత్సరంలో కూలీలకు 78 లక్షల పనిదినాలు కల్పించటానికి భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికలు రూపొందించుకున్నామని వివరించారు. జిల్లా కలెక్టరు ఉపాధి కూలీల వేతనాల నిమిత్తం రూ.250 కోట్లు నిధులు ఆమోదం తెలిపినట్లు చెప్పారు. అమృత్ సరోవర్ పథకంలో భాగంగా 80 రక్షిత తాగునీటి చెరువులు అభివృద్ధి చేయాల్సి ఉండగా 55 చెరువుల పనులు పూర్తి చేశామన్నారు. ఆయనతో పాటు జిల్లా ఉపాధి అధికారులు జి.బాబురావు, తలారి విజయలక్ష్మి, ఏపీడీ పి.ఓబుల్‌రెడ్డి, ఎంపీడీఓ పి.సీతారామయ్య ఉన్నారు.

సీఐపీఈటీలో డిప్లొమా కోర్సులకు దరఖాస్తులు

నరసరావుపేట: విజయవాడలోని సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెట్రో కెమికల్స్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ (సీఐపీఈటీ) ప్రభుత్వ సంస్థలో 2023-24 ఏడాదికి డిప్లొమా, పోస్టు గ్రాడ్యుయేట్ డిప్లమా కోర్సులకు ఆన్‌లైన్‌లో www.cipet.gov.in వెబ్‌సైటు ద్వారా ఈనెల 28లోగా దరఖాస్తు చేసుకోవాలని సంస్థ జాయింట్ డైరెక్టర్ సీహెచ్.భాస్కర్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. మూడేళ్ల వ్యవధి గల డిప్లొమా ఇన్ ప్లాస్టిక్ టెక్నాలజీ (డీపీటీ), డిప్లొమా ఇన్ ప్లాస్టిక్ మౌల్డ్ టెక్నాలజీ (డీపీఎంటీ) కోర్సులకు పదో తరగతి ఉత్తీర్ణులైన, చదువుతున్న విద్యార్థులు అర్హులని తెలిపారు. రెండేళ్ల పోస్టు గ్రాడ్యుయేషన్ డిప్లొమా ఇన్ ప్లాస్టిక్స్ ప్రాసెసింగ్ అండ్ టెస్టింగ్ (పీజీడీ-పీపీటీ)కు బీఎస్సీ ఉత్తీర్ణత, ఫైనల్ ఇయర్ విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. ఓబీసీ, జనరల్ విద్యార్థులు రూ.500, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.250 ఆన్‌లైన్‌లో చెల్లించి పేర్లు రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. వచ్చే జూన్ 11వ తేదీ విజయవాడ, అనంతపురంలో సీఐపీఈటీ ఆన్‌లైన్ అడ్మిషన్ టెస్టు-23 నిర్వహించనున్నట్లు వెల్లడించారు. వివరాలకు 93980 50255ను సంప్రదించాలని కోరారు.